ప్రజాశక్తి
సోమవారం 21 నవంబర్ 2022
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

ఫిషింగ్ హార్బర్ టెండర్లు ఖరారు

- రూ.152 కోట్లతో ఆధునికీకరణ పనులు
- పక్షం రోజుల్లో ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

దాదాపు అర్ధ శతాబ్దపు చరిత్ర కలిగిన విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణకు ఎట్టకేలకు అంకురార్పణ జరుగనుంది. రూ.152 కోట్లతో ఆధునికీకరణ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. 15 నుంచి మరో పక్షం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ మేరకు టెండర్లు పిలవడం, వాటిని ఖరారు చేయడం కూడా జరిగిందని తెలిపారు. ఇందుకయ్యే ఖర్చులో విశాఖపట్నం పోర్టు రూ.25 కోట్లు, మత్స్యశాఖ మత్స్య సమృద్ధి యోజన కింద రూ.50 కోట్లు, సాగర మాల ప్రాజెక్టు కింద కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ రూ.50 కోట్లు చొప్పున విడుదల చేశాయి. మిగిలిన రూ.27 కోట్లు పిపిపి కింద ప్రయివేటు సంస్థల నుంచి సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

అందుబాటులోకి రానున్న సౌకర్యాలు

అనుకున్న విధంగా పనులు పూర్తయితే ఫిషింగ్ హార్బర్‌లో కలిగే ప్రయోజనాలు ఇలా ఉంటాయి. ప్రస్తుతం 11 జెట్టీలు ఉన్నాయి. వీటిని సమూలంగా మార్చి వేస్తారు.వాటి ప్లాట్‌ఫారాలను ఎత్తి చేసి వసతులు కల్పిస్తారు. వీటితో పాటు అదనంగా మూడు ఫ్లోటింగ్ జట్టీలు వస్తాయి. వీటివల్ల మత్స్యకారులు పడవలు, బోట్లు నిలపడానికి అదనపు వసతులు కల్పించినట్లు అవుతుంది. ఫిషింగ్ హార్బర్‌లో ప్రస్తుతం ఉన్న వేలం కేంద్రాలతో పాటు అదనంగా మరో వేలం కేంద్రం ఏర్పాటు చేస్తారు. వీటన్నింటినీ కేంద్రీకృత శీతల కేంద్రాలుగా మార్పు చేస్తారు. 55 టన్నుల నుంచి 70 టన్నుల కెపాసిటీ కలిగిన కోల్డ్ స్టోరేజీ యూనిట్ ఏర్పాటు చేస్తారు. ఇది ఏర్పాటైతే మత్స్యకారులు మత్స్య సంపదను ఎక్కువ రోజులు పాటు ఇక్కడ నిల్వ చేసుకుని, గిట్టుబాటు ధర వచ్చే సమయంలో అమ్ముకునే అవకాశం కలుగుతుంది. ఫిషింగ్ హార్బర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తారు. కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తాయి. ప్యాకేజీ యూనిట్ ఏర్పాటు అవుతుంది. మురుగు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. శుద్ధి చేసిన నీటిని ఫిషింగ్ హార్బర్ అవసరాలకు వినియోగిస్తారు. విశాఖపట్నంలో 1976లో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో 11 జెట్టీలతో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేశారు. హార్బర్ పురాతనమైనది కావడంతో వసతులు బాగా దెబ్బతిన్నాయి. ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరణ చేయాలని మత్స్యకారులు కొన్నాళ్లుగా అన్ని ప్రభుత్వాల పాలకులను కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు ఆధునీకరణకు ముహూర్తం ఖరారు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న షేక్ సాబ్జీ, వేదికపై ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

గిరిజన విద్యారంగ

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సులో వక్తలు
- పలు జిల్లాల నుంచి భారీగా కదిలొచ్చిన ఉపాధ్యాయులు
- పాడేరు ఐటిడిఎ నుంచి కాఫీ హౌస్ వరకూ భారీ ర్యాలీ

ప్రజాశక్తి - పాడేరు : గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పలువురు వక్తలు అన్నారు. గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం పాడేరు కాఫీ హౌస్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు విజయవంతమైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి యుటిఎఫ్ ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు అధిక శాతం మహిళా ఉపాధ్యాయినిలు తరలివచ్చారు. పాడేరు ఐటిడిఎ నుంచి కాఫీ హౌస్ వరకూ ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. గిరిజన ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని, సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని, పిఇటి, పండిట్ మిగతా 2లో..

ఎక్కడి నిర్మాణాలు అక్కడే..!

▸ వార్త 8లో..

నర్సీపట్నంలో విషాదం

▸ వార్త మెయిన్‌లో..

కార్మిక హక్కులపై ఉధృత పోరాటాలకు సిద్ధం

▸ వార్త 8లో..

పాటతో సభికుల్లో ఉత్సాహం నింపుతున్న ఆర్.నారాయణమూర్తి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రజా ఉద్యమం

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' సదస్సులో వక్తలు వార్త మెయిన్‌లో..

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

- పెరుగుతున్న వినియోగం
- తగ్గుతున్న సరఫరా నష్టం
- మార్చికి జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు పూర్తి
- ఆర్‌డిఎస్‌ఎస్ కింద రూ.1700 కోట్లతో పనులు
- ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ మహేంద్రనాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు, నష్టాలు తగ్గించడానికి తీసు కుంటున్న చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయి. ఆర్‌డిఎస్‌ఎస్ కింద మంజూరైన రూ.1700 కోట్లతో చేపట్టనున్న పనులతో ఈ సేవలు మరింత మెరుగుపడనున్నాయి. జగనన్న కాలనీలో విద్యుదీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి వీధి దీపాలు, గృహాలకు ఉచితంగా కొత్త మీటర్లు, కనెక్షన్లు ఇవ్వనున్నాం. ఐదేళ్లలో విద్యుత్ సర్వీసులు ఇవ్వడంలోనూ, సరఫరాలోనూ విశాఖ సర్కిల్ మంచి ప్రగతి సాధించింది. స్మార్ట్ మీటర్లతో సేవలు మరింత సరళతరమవుతాయి. వినియోగదారులకు మెరుగైన సేవలు సకాలంలో అందుతాయి.' అని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్

ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

ఏ తరహా సర్వీసులు ఎన్ని వున్నాయి?

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 17,26,960 విద్యుత్ సర్వీసుల్లో హెచ్‌టి 1699, ఎల్‌టి 17,25,261 వున్నాయి. గృహ వినియోగ సర్వీసులు 14,77,110, వ్యవసాయ కనెక్షన్లు 48,095, పారిశ్రామిక సర్వీసులు 4,752 మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, గిరిజన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని, భాషా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలని నినదించారు. ర్యాలీ అనంతరం కాఫీ హౌస్ ప్రాంగణంలో జరిగిన విద్యా సదస్సుకు సుమారు 700 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తీరును పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, యుటిఎఫ్ రాష్ట్ర, పలు జిల్లాల నేతలు ఎండగట్టారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సరఫరా చేసే కాస్మోటిక్ ఛార్జీలను అమ్మ ఒడి పథకం సాకుతో రెండేళ్ల నుంచి పంపిణీ చేయకపోవడంపై మండిపడ్డారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం లేదంటూ మండిపడ్డారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో భాషా వాలంటీర్లను నియమించకుండా పిఒ అడ్డుపుల్ల వేస్తున్నారని తెలిపారు. సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రసాద్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, నాయకులు పి.అప్పలనర్స, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పి.మహేష్, నాయకులు తోట రమేష్, ఎస్.నాగమణి, పి.విల్సన్‌బాబు, చౌదరి రవీంద్ర, ఎస్.మురళీమోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ గెలుపునకు కృషి

రానున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించడమే ఉపాధ్యాయుల కర్తవ్యంగా భావించి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. పాడేరు కాఫీ హౌస్‌లో జరిగిన విద్యా సదస్సునకు రమాప్రభ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చట్ట సభల్లో ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించే అవకాశం రమాప్రభ గెలుపు ద్వారా సాధ్యమవుతుందని అన్నారు. అభ్యర్థి రమాప్రభ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సంపూర్ణ విద్యాభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల అక్షరాస్యత 46 శాతం మాత్రమే ఉందన్నారు. ప్రభుత్వాల తీరుతో గిరిజన యువతకు జీవన, ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయని చెప్పారు. విద్యాలయాల్లో సదుపాయాలు కరువయ్యాయన్నారు. డోలీల్లో రోగులను ఆసుపత్రులకు తీసుకువెళ్లే పరిస్థితి నేటికీ ఉండటం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి తార్కాణమన్నారు. గిరిజన ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

వున్నాయి. ఏడు ఆపరేషన్స్ సబ్ డివిజన్లలో ఒక 400/220 కెవి సబ్‌స్టేషన్, ఆరు 220/132, పదిహేడు 132/33, 33/11 కెవి సబ్‌స్టేషన్లు 224, 33 కెవి ఫీడర్స్ 169, 11 కెవి ఫీడర్స్ 938 వున్నాయి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొత్తగా 400/220 కెవి సబ్‌స్టేషన్ అచ్యుతాపురంలో ఏర్పాటు చేయనున్నాం.

విద్యుత్ డిమాండ్, సరఫరాకు అంతరం ఎంతవుంది ?

శీతాకాలం ప్రవేశంతో విద్యుత్ డిమాండ్ తగ్గింది. జూన్‌లో గరిష్టంగా 1397 మెగావాట్ల డిమాండ్ వుండగా, నేడది 1189 మెగావాట్లకు తగ్గింది. శీతాకాలంలో ఎసిల వాడకం తగ్గడంతో విద్యుత్ వినియోగం తగ్గింది. వినియోగదారుల అవసరాలకు తగినట్లు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

విద్యుత్ సర్వీసుల ప్రగతి, వినియోగం ఎలా వుంది ?

గతేడాది కంటే పరిశ్రమల అవసరాలు పెరగడంతో హెచ్‌టి సర్వీసుల వినియోగం 61.49 శాతం నుంచి 65.71 శాతానికి పెరిగింది. ఐదేళ్ల ప్రగతి సర్కిల్‌లో బాగుంది. 2016-17లో విద్యుత్ వినియోగం 5,496 మిలియన్ యూనిట్ల నుంచి నేడది 8,165 మిలియన్ యూనిట్లకు (48.56 శాతానికి) పెరిగింది. రెవెన్యూ డిమాండ్ రూ.3,354 కోట్ల నుంచి రూ.5,208 కోట్లకు (55.26 శాతానికి) పెరిగింది. వాణిజ్య సర్వీసులు 42 శాతం, పరిశ్రమల వినియోగం 65 శాతం, గృహ విద్యుత్ వినియోగం 57 శాతం పెరిగింది.

కొత్తగా ఎన్ని వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చారు ?

ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1085 వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం. ఇంకా మరో 39 ఇవ్వాల్సివుంది. పొలాల మధ్య నుంచి సర్వీసులు ఇవ్వాల్సివుండడంతో రైతుల అభ్యంతరాలు వల్ల మరో 40, ప్రస్తుతం పంటలు వుండడం వల్ల మరో 51 సర్వీసులు పెండింగ్‌లో వున్నాయి. కనెక్షన్లు ఇవ్వడానికి అనుకూలంగా వుంటే వెంటనే పనులు పూర్తిచేస్తాం.

నాణ్యమైన విద్యుత్ సరఫరా, నష్టాల తగ్గుదలకు తీసుకుంటున్న చర్యలేంటి ?

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు, సరఫరా నష్టాలు తగ్గించేందుకు చేస్తున్న కృషి మంచి ఫలితాలనిస్తోంది. సర్వీసు నష్టాలు 3.09 నుంచి 2.99 శాతానికి తగ్గాయి. విద్యుత్ ఎక్కువగా సరఫరా చేస్తున్న, నష్టాలు తక్కువగా వున్న సర్కిల్‌గా గుర్తింపుపొందింది. తరచూ లైన్లను తనిఖీ చేస్తున్నాం. సరఫరా అంతరాయానికిగల సమస్యలను పరిష్కరిస్తున్నాం. లో ఓల్టేజీ సమస్య వున్నచోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. వినియోగదారుల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై స్పందిస్తున్నాం. ఆర్‌డిఎస్‌ఎస్ కింద మంజూరైన రూ.1700 కోట్లతో అండర్ గ్రౌండ్ కేబుల్స్, సబ్‌స్టేషన్స్, కవర్డ్ కండక్టర్, స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లు, గృహ అవసరాలకు వేర్వేరుగా లైన్లు ఏర్పాటు వంటివి చేపట్టనున్నాం. ఈ పనులు పూర్తయితే వినియోగదారులకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడ్డంతో పాటు సరఫరా నష్టాలు తగ్గనున్నాయి.

జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు ఎలా జరుగుతున్నాయి ?

జగనన్న కాలనీలో విద్యుదీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీధి దీపాలు, గృహాలకు కొత్త మీటర్లు, కనెక్షన్లు ఉచితంగా ఇస్తున్నాం. నిర్దేశిత లక్ష్యం ప్రకారం 956 లే అవుట్లు, 58 వేల ఇళ్లకు విద్యుత్ సర్వీసు పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేస్తాం.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఎంతవరకు వచ్చింది ?

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు జరగాల్సిన ప్రక్రియంతా పూర్తికావాల్సింది. అవన్నీ అయ్యాక స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయనున్నాం. స్మార్ట్ మీటర్లతో సంస్థ ఉద్యోగుల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది. వినియోగదారులకు సేవలు మరింత సులభతరమవుతాయి. విద్యుత్ సరఫరాలో ఎక్కడ ఎటువంటి సమస్యలు, లోపాలున్నా వాటిని సకాలంలో పరిష్కరించగలుగుతాం.

ఉద్యోగ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మహారాణి పేట సిఐ సోమశేఖర్

మాట్లాడుతున్న సిఐ సోమశేఖర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ శిక్షణ తరగతులను యువత సద్వినియోగం చేసుకోవాలని మహారాణి పేట సిఐ సోమశేఖర్ కోరారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నూతన తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు యువత కష్టపడి చదవాలన్నారు. మంచి మార్కులు సాధించేందుకు కరెంట్ అఫైర్స్‌పై దృష్టి సారించాలని, ఎక్కువుగా రివిజన్ చేయాలని అన్నారు. ఎలాంటి లాభాపేక్షా లేకుండా అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోలీస్, కానిస్టేబుల్, కోర్టు ఉద్యోగాలకు శిక్షణ అందించడం గొప్ప విషయమన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ యువత కోసం కోచింగ్ ప్రారంభించామని, నిపుణులతో బోధన చేయిస్తున్నామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్య, వైద్యానికి సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎయు ఎకనామిక్స్ ప్రొపెసర్ డాక్టర్ పద్మ, స్టడీ సర్కిల్ నిర్వాహకులు కె.అభిమన్యు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పుస్తక పఠనం మనిషి మానసిక ఒత్తిడిని తగ్గించి నూతన ఆలోచనల పెంపునకు మార్గం సుగమం చేస్తుందని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ అన్నారు. విశాలాంధ్ర విశాఖ 21వ పుస్తక మహోత్సవ ప్రాంగణాన్ని ఆయన ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిమ సమాజం నుంచి నేటి నవీన కాలం వరకూ అభివృద్ధికి వారధులుగా పుస్తకాలు నిలిచాయనడంలో ఏమాత్రమూ సందేహం లేదన్నారు. పుస్తక పఠనం ద్వారానే మానవుడు తనను తాను తెలుసుకుని ముందుకెళ్తున్నాడన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగ్గా జీవితాన్ని కొనసాగించడానికి పుస్తక పఠనం దోహదపడుతుందని తెలిపారు. ఒక సమూహం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే పుస్తక పఠనం కీలకమన్నారు. నేడు ప్రపంచంలో అన్యాయాలు, అకృత్యాలు పెరిగిపోయాయని, పుస్తక పఠనం, ఆటలు లేకపోవడమే దీనికి కారణమని అన్నారు. పుస్తక పఠనం ద్వారా అబ్రహం లింకన్, నెల్సన్ మండేలా, మహాత్మా గాంధీ, అంబేద్కర్ వంటి ఎందరో మేధావులు సమాజంలో ఉన్న అనేక అసమానతలపై పోరుబాట నడిపారని అన్నారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, బుక్ హౌస్ మేనేజర్ పిఎ.రాజు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోడ్డుపై ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని జిల్లా ఉప రవాణా అధికారి రాజారత్నం అన్నారు. ప్రపంచ రోడ్డు ప్రమాద బాధితుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆర్కే బీచ్, కాళీ మాత ఆలయం వద్ద జిల్లా రవాణా శాఖ , ది ఎబిలిటీ పీపుల్ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజారత్నం మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రత క్రమశిక్షణ ముఖ్యమన్నారు.

సీటు బెల్టు, హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి విధి అన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు, ది ఎబిలిటీ పీపుల్ సంస్థ డైరెక్టర్ దిలీప్ పాత్రో పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22న ఐదు ప్రముఖ కంపెనీలలోని 200 ఖాళీల భర్తీకి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబిఎ, బిటెక్, ఐటిఐ, డిప్లొమా వరకూ చదివి ఉద్యోగం కోసం చూస్తున్న యువతీ యువకులు హాజరుకావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు www.ncs.govt.in పోర్టల్‌ను చూడాలన్నారు. ఎంపికైన యువతకు రూ.10 వేల నుంచి రూ.20 వేల మధ్య వేతనం ఉంటుందన్నారు.

నేవీ డే ఉత్సవాల్లో వృద్ధులు, చిన్నారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేవీ డే ఉత్సవాల్లో భాగంగా తూర్పు నౌకాదళ నౌకల్లోకి వృద్ధులను, చిన్నారులను ఆదివారం అనుమతించారు. నగరానికి చెందిన బాల్‌వాడి పాఠశాల విద్యార్థులు ఐఎన్ఎస్ జలశ్వను సందర్శించారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్ పరిధి పలాస-విశాఖపట్నం సెక్షన్‌లోని ఉర్లాం స్టేషన్ యార్డ్‌లో కట్ అండ్ కవర్ పద్ధతిలో ఆర్‌సిసి సెగ్మెంటల్ బాక్సులను ఏర్పాటు, ఆధునికీకరణ పనులు జరుగుతున్నందున పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు. 18526/18525 విశాఖపట్నం-బ్రహ్మపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 22820/22819 విశాఖపట్నం-భువనేశ్వర్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు, 08522/08521 విశాఖపట్నం- గుణుపూర్-విశాఖపట్నం ప్యాసింజర్ రైళు, 08532/08531 విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్ళను ఈ నెల 24న రద్దు చేశారు. ప్రయాణికులు ఈ విషయాలను గమనించి అందుకనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
I.A.No.124/2021 in O.S.No.541/2006

Between:
Ayyalasomayajula Lakshmi Narasamma & Another ...Petitioners / Plaintiffs
And:
Smt. Padmasolala Veerabhadramma & Others ...Respondents / Defendants
To,
Respondents 2 & 4:
2. Smt Garimella Venkata Lakshmi W/o. Ramakrishna, Hindu, aged 43 years, D.No. 49-14/1/5, Sri Seetha Ramanjaneya Kirana and General Stores, Lalithanagar, Sangam Office Junction, Akkayyapalem, Visakhapatnam.
4. Padmasolala Venkata Subba Rao, S/o. Agnihotra Gowripathi Sastry, Hindu, aged 39 years, D.No. 20-112-27, Kotha Agraharam, Chengalarao Peta, Visakhapatnam.

నోటీసు

పై నెంబరు I.A.124/2021ను 6వ వాది చనిపోయినందున ఆయన తాలుకా వారసులను చేర్చమని పై నెంబరు I.A.ను పిటీషనర్లు, రెస్పాండెంట్లు పై దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరులో 2, 4 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం **తేది:06-12-2022కి** వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదీన మీరు గాని మీ వకీలుగారి ద్వారా గాని పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియ పరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడమగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

లంక జగన్నాథం
లంక పార్వతీశ్వర్
అడ్వకేట్లు,
అనకాపల్లి.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
I.A.No.123/2021 in O.S.No.541/2006

Between:
Ayyalasomayajula Lakshmi Narasamma & Another ...Petitioners / Plaintiffs
And:
Smt. Padmasolala Veerabhadramma & Others ...Respondents / Defendants
To,
Respondents 2 & 4:
2. Smt Garimella Venkata Lakshmi W/o. Ramakrishna, Hindu, aged 43 years, D.No. 49-14/1/5, Sri Seetha Ramanjaneya Kirana and General Stores, Lalithanagar, Sangam Office Junction, Akkayyapalem, Visakhapatnam.
4. Padmasolala Venkata Subba Rao, S/o. Agnihotra Gowripathi Sastry, Hindu, aged 39 years, D.No. 20-112-27, Kotha Agraharam, Chengalarao Peta, Visakhapatnam.

నోటీసు

పై నెంబరు I.A.123/2021ను 6వ వాది చనిపోయినందున ఆయన తాలుకా వారసులను చేర్చడంలో శ్రీ కోర్టు వారు abate చేసినందున సదరు abatement orderను రద్దు చేయించ వలసిందిగా పై నెంబరు ఐ.ఎ.ను పిటీషనర్లు, రెస్పాండెంట్లు పై దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరులో 2,4 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం **తేది:06-12-2022కి** వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదీన మీరు గాని మీ వకీలుగారి ద్వారా గాని పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియ పరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడమగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

లంక జగన్నాథం
లంక పార్వతీశ్వర్
అడ్వకేట్లు, అనకాపల్లి.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
I.A.No.122/2021 in O.S.No.541/2006

Between:
Ayyalasomayajula Lakshmi Narasamma & Another ...Petitioners / Plaintiffs
And:
Smt. Padmasolala Veerabhadramma & Others ...Respondents / Defendants
To,
Respondents 2 & 4:
2. Smt Garimella Venkata Lakshmi W/o. Ramakrishna, Hindu, aged 43 years, D.No. 49-14/1/5, Sri Seetha Ramanjaneya Kirana and General Stores, Lalithanagar, Sangam Office Junction, Akkayyapalem, Visakhapatnam.
4. Padmasolala Venkata Subba Rao, S/o. Agnihotra Gowripathi Sastry, Hindu, aged 39 years, D.No. 20-112-27, Kotha Agraharam, Chengalarao Peta, Visakhapatnam.

నోటీసు

పై నెంబరు I.A.122/2021ను 6వ వాది చనిపోయినందున ఆయన తాలుకా వారసులను చేర్చడంలో 85 రోజులు ఆలస్యం అయినందున సదరు ఆలస్యంను శ్రీకోర్టు వారు Condone చేయించవలసిందిగా పై నెంబరు I.A.ను పిటీషనర్లు, రెస్పాండెంట్లు పై దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరులో 2,4 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం **తేది:06-12-2022కి** వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదీన మీరు గాని మీ వకీలుగారి ద్వారా గాని పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియ పరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడమగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

లంక జగన్నాథం
లంక పార్వతీశ్వర్
అడ్వకేట్లు, అనకాపల్లి.

పర్యాటక సొగసరి భీమిలి

భీమిలి తీరం

అలరించే ఎర్ర మట్టిదిబ్బలు
సువిశాల సముద్ర తీరం
విజ్ఞానాన్ని పంచే పురాతన కట్టడాలు
వన భోజనాలకు తరలివస్తున్న ప్రజానీకం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నింగిని తాకాలన్న ఉత్సాహంతో ఉవ్వెత్తున ఎగిసిపడే కడలి కెరటాలు, ఆంధ్రా నుదుట తిలకం దిద్దినట్లు గోచరించే, ఆసియా ఖండంలోనే అరుదైన ఎర్ర మట్టి దిబ్బలు సహజ సౌందర్యాన్ని పరుచుకున్న తీరం... చారిత్రాత్మక భీమిలి సొంతం. ఇక్కడి ఇసుక తిన్నెలు పర్యాటకులను రా రమ్మని పలకరిస్తాయి. చారిత్రక కట్టడాలు విజ్ఞానాన్ని పంచుతాయి. సహజ సిద్ధ సోయగాలతో ప్రకృతి ప్రసాదించిన అందాల భీమిలికి కార్తీక సందడి రానే వచ్చింది. ఇప్పటికే వన భోజనాల కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఏయే విహార కేంద్రాలు ఉన్నాయో ఓ సారి తెలుసు కుందాం.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా గోదావరి, ఒడిశా ప్రాంతాల నుంచి అత్యధికంగా తరలివచ్చే సందర్శకులతో భీమిలి ఏటా కిటకిటలాడుతుంది.

పట్టణానికి శోభాయమానంగా నిలిచిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయం ఇక్కడే ఉండటంతో ఎక్కువ మంది వెళ్తారు. 13వ శైవ, వైష్ణవ ఆలయాలు సముదాయం, 1963లో నిర్మించిన గంటస్తంభం, తీరంలోని లైట్‌హౌస్, పోర్ట్ షిప్పింగ్ కార్యాలయం, పురాతన డచ్ సమాధులు, ఇలా ఎన్నో గత వైభవ చారిత్రక సాక్ష్యాలు ఈ పట్టణంలోనే ఉన్నాయి. ఇవి సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. పల్లె ప్రేమకు కేంద్ర బిందువుగా, అనాథ పిల్లలకు ప్రేమానురాగాలు అందించే కల్పవల్లిగా ఉమ్మడి రాష్ట్రంలోని మొట్ట మొదటి ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్, బీచ్ రోడ్డు, మంగామారిపేట వద్ద (రామాద్రి) ఏర్పాటైన చిన జీయర్ స్వామి వేద విశ్వ విద్యాలయం, కీటిన్‌పేటలోని సెయింట్ పీటర్స్ చర్చి, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలు ఇక్కడే కొలువుదీరాయి. బీచ్ రోడ్డులోని తిమ్మాపురం, మంగమారిపేట, తొట్లకొండ బౌద్ధ క్షేత్రాలు తదితర పిక్నిక్ స్పాట్లు పర్యాటకులను నిత్యం ఆకర్షిస్తుంటాయి. భీమిలి సాగర తీరంలోని చిల్డ్రన్స్ పార్కు, పావురాల పార్కు పిల్లలకు ఎంతో వినోదాన్ని అందిస్తున్నాయి. గోకుల్ పార్కులోని శ్రీ కష్ణుని విగ్రహాలు ముద్దులొలుకుతున్నాయి. సాగర తీరంలో కాసేపు గడిపిన క్షణాలు సైతం సందర్శకుల మదిలో మరపురాని మధురాను భూతులుగా మిగిలి పోతాయనడంలో సందేహం లేదు. అందుకే కార్తీక మాసాన వన భోజనాల కోసం ఎక్కువ మంది భీమిలికి వచ్చేందుకు ఆశక్తి చూపుతున్నారు.

బౌద్ధ విగ్రహాలు

నేరాలు ఘోరాలు

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. మధురవాడ మల్లయ్యపాలెంనకు చెందిన కాయ చిన్నికృష్ణ, వాంబేకాలనీకి చెందిన చెంచులు దినేష్‌ను నగర పాలన రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీరు గత కొంతకాలంగా ఎస్ కోట ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ చిన్న చిన్న పొట్లాలు ప్యాక్ చేసి అమ్మకం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం సాయంత్రం పట్టుకుని వారి నుంచి మూడు కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నర్సీపట్నానికి చెందిన చంద్ర జానీ ఇలియాస్ సాంబను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

చెట్టు పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో రామచంద్రపురం గ్రామానికి చెందిన మంచాల నారాయణరావు (52) పందూరు సెంటర్ వద్ద టేకు చెట్టు నరుకుతూ ఉండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో, నారాయణరావు మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-పాయకరావుపేట: తుని సీతారాంపురం వీధికి చెందిన లంక శ్రీనివాస్ (45) పాయకరావుపేట కనోసా ఇంగ్లీష్ మీడియం స్కూలు వద్ద శనివారం రాత్రి జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో కుడి కాలిపై బలమైన గాయమైంది. బాధితుడిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట ఆర్ఇసిఎస్‌ను ఆనుకుని ఉన్న మామిడి తోటలో పేకాట శిబిరంపై అదనపు ఎస్ఐ జె నాగేశ్వరరావు, ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాటాడుతున్నారని అందిన సమాచారంతో దాడులు చేసి, ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.1680 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గల్లంతైన వారిలో ఒకరి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : సముద్రంలో ఈతకు దిగి ఈ నెల 18న గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కుడితి సాయి (19) మృతదేహం శనివారం రాత్రి స్థానిక బీచ్ సమీకృత బాలికల వసతి గృహం వెనుక ఒడ్డుకు కొట్టుకొచ్చింది. లైట్ హౌస్ ఎదురుగా సాగర కన్య బొమ్మ వద్ద అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇసిఇ ద్వితీయ ఏడాది విద్యార్థులు మధురవాడ కారుషెడ్డు ప్రాంతానికి చెందిన కుడితి సాయి, పెందుర్తికి చెందిన వేమల సూర్యవంశీ ఈ నెల 18న గల్లంతైన విషయం విదితమే. ఒడ్డుకు చేరిన సాయి మృతదేహం వద్ద అతని తల్లిదండ్రులు భోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన మరో విద్యార్థి సూర్య వంశీ ఆచూకీ ఇంకా లభించలేదు.

ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షునిగా గోవిందరావు

ప్రజాశక్తి - ఆనందపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న ఐ.గోవింద రావును ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాలకు భీమునిపట్నం తాలూకా యూనిట్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, తాలుకా యూనిట్ పరిధిలో వృత్తిపరంగా న్యాయమైన సమస్యలు ఉంటే పైఅధికారులతో మాట్లాడి అసోసియేషన్ ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఉద్యోగస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-సింహాచలం: కార్తీకమాసంతోపాటు ఆదివారం సెలవు దినం కావడంతో సింహగిరిపైకి భక్తులు పోటెత్తారు. భక్తులు రద్దీని చూసి గాలిగోపురం దర్శనాలు మూసివేశారు. దీంతో రూ.300, రూ.100 క్యూ లైన్లతోపాటు ఉచిత దర్శనాల క్యూలైన్‌లో భారీగా భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. ప్రసాదాల కోసం కూడా అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చిందని భక్తుల వాపోయారు. సింహగిరిపై ఎటు చూసినా వాహనాలే దర్శనమిచ్చాయి. పార్కింగ్‌కు స్థలం లేక రోడ్లపై వాహనాలు నిలిపి ఉంచటంతో పలుచోట్ల ఇబ్బందులు కనిపించాయి.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2021-22 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం నగదు బహుమతులు అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1969లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి నగదు బహుమతులు అందజేశారు. ఈ మేరకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్ కావేరికి రూ.10 వేలు, ఎన్.వినోద్‌కుమార్‌కు, రూ.7,500, పి.సాయిదుర్గకు రూ.6 వేలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా అందజేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి జగ్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మానవేంద్ర రావు, చందు, రామకృష్ణ, మరో తొమ్మిది మందితో పాటు పాఠశాల యాజమాన్య కమిటీ కో-ఆప్షన్ సభ్యులు మైలపల్లి లక్ష్మణరావు, ఫిజికల్ డైరెక్టర్ కిషోర్, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన వారితో పూర్వ విద్యార్థులు

విలువలతో కూడిన విద్యనందించాలి : బులికృష్ణ

బాలల వారోత్సవాల ముగింపులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బులికృష్ణ

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలలకు విలువలతో కూడి విద్యను అందించి సమాజం మెచ్చే పౌరునిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బులికృష్ణ అన్నారు. బాలల వారోత్సవాల ముగింపు కార్యక్రమం దీనదయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి బులికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు చెప్పినట్టు విని, పరివర్తన చెందిన మనస్సుతో బాలలు తిరిగి వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్మన్ ఎం.రామలక్ష్మీరాధ, పిఆర్ఎస్ రాజు, జి.వెంకటరమణారెడ్డి, బాలుర గృహం పర్యవేక్షణాధికారి వీరయ్య, సిబ్ల్యుసి సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నదానం

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో పరుశురాం గురుస్వామి శిష్య బృందం ఆధ్వర్యాన అయ్యప్పస్వామి ఊరేగింపు, భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం సభ్యులు మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి దీక్షలో భాగంగా దాదాపు ఆరు వేల మంది స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అయ్యప్ప స్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని కేరళ సంప్రదాయాల ప్రకారం నిర్వహించ తలపెట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దుర్గా ఉష డెవలపర్స్, మణికంఠ సప్లయిర్స్, ఆరో వార్డు వైసిపి నాయకులు పోతిన యాల్లాజీ, భాస్కర్, రాము, ఎస్‌వి.రమణ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న అయ్యప్పలు

'స్టీల్' ఉద్యమంలో భాగస్వాములుకండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 647వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు నందికి తాతారావు, పిట్ట రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రం తహతహలాడుతోందని విమర్శించారు. విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవ్వరు వచ్చినా అడ్డుకుంటామని స్పష్టంచేశారు. పోరాటాలు, ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్ పరం కానివ్వబోమన్నారు. కాంట్రాక్టు కార్మికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమ్‌సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీన రాజ్యాంగదినోత్సవం సందర్భంగా పబ్లిక్ లైబ్రరీలో భీమ్‌సేన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన 'భారత రాజ్యాంగం -సవాళ్లు' అనే అంశంపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భీమ్‌సేన వార్ గౌరవాధ్యక్షులు ఎస్ఆర్.వేమన మాట్లాడుతూ, ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదంలో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాలని కోరారు. ప్రొఫెసర్ కెఎస్.చలం మాట్లాడుతూ రాజ్యాంగ పీఠిక రాసే క్రమంలో అంబేద్కర్‌కు ఎదురైన అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా భీమ్‌సేన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఉచితంగా తెలుగు అనువాదంలో ఉన్న రాజ్యాంగ పుస్తకాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కె.సత్యనారాయణ సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, జీలకర్ర శ్రీనివాస్, మచ్చ దేవేందర్ తదితరులు హాజరయ్యారు.

కరాటే క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి-గాజువాక : విజయనగరం జిల్లా కొత్తవలసలో ఈ నెల 6వ తేదీన జరిగిన ఇన్విటేషనల్ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్ 2022 పోటీలలో ట్రోఫీని సొంతం చేసుకున్న సాయివాణి స్కూల్ విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ పోటీలలో స్వర్ణం, సిల్వర్, రజిత మెడల్స్ సాధించిన క్రీడాకారులకు 74వ వార్డు పరిధి దయాల్‌నగర్‌లో బొడ్డ గోవింద ఆధ్వర్యాన ఆదివారం అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, సాయి వాణి స్కూల్ ప్రిన్సిపల్ రామినాయుడు హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ, ప్రతిరోజూ ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. వ్యాయామంతో మానసిక, శారీరక ఒత్తిడులను అధిగమించవచ్చన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని సూచించారు. ప్రభుత్వ కొలువులో ఉపాధి పొందేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సూర్యనారాయణరాజు, విశాఖ జిల్లా కెఎల్ ప్రెసిడెంట్ ఈశ్వరరావు, కోచ్ గుడివాడ నారాయణమూర్తి, కరాటే మాస్టర్ బ్రహ్మ రాజన్ననాయుడు, రొగలి భారతి, కరాటే మాస్టర్ శ్రీనివాసరావు, కాలపురెడ్డి దుర్గ భవానీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దంత పరీక్షలు చేస్తున్న స్టైల్ డాక్టర్లు

ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకకు చెందిన న్యూ స్టైల్ మల్టీస్పెషల్టీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యాన 69వ వార్డు పరిధి బంగారమ్మ గుడి వద్ద ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 80 మందికి ఉచిత దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముద్దపు కల్యాణి మాట్లాడుతూ, తమ హాస్పిటల్ ఆధ్వర్యాన మరిన్ని వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప, డాక్టర్ సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

కాయల వెంకటరెడ్డిని సన్మానిస్తున్న మామ్స్ లిటిల్ మంకీస్ బేబీ కిడ్స్ నిర్వాహకులు

మామ్స్ లిటిల్ మంకీస్ బేబీ కిడ్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి -కంచరపాలెం : గోపాలపట్నంలో మామ్స్ లిటిల్ మంకీస్ బేబీ కిడ్స్ స్టోర్‌ను ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ప్రారంభించారు. అనంతరం వెంకటరెడ్డిని స్టోర్ నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జివిఎంసి కో.ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు, ఎస్‌బిఎస్ఆర్ గ్రూప్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ సత్తి వీరరాఘవరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా 'హెల్పింగ్ హ్యాండ్స్'

వ్యవస్థాపకులు యతిరాజుల నాగేశ్వరరావు

పేద మహిళలకు చీరలు పంపిణీచేస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి-పెందుర్తి: అభాగ్యులకు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, వైసిపి నగర అధికార ప్రతినిధి, ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు యతిరాజుల నాగేశ్వరరావు అన్నారు. జివిఎంసి 94వ వార్డు నాయుడుతోట, అప్పలనరయ్య కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం సభ్యులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అప్పలనరసయ్య కాలనీలో ఓ వికలాంగ వృద్ధురాలికి ఆర్థిక సాయంతో పాటు చీరను అందజేశారు. జోన్- 8 కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గంగిరెడ్ల కాలనీలో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు ధనకొండ పూజిత, నీలిమ, నందినీలకు ఆర్థిక సాయంతో పాటు నెలకు సరిపడా నిత్యవసర వస్తువులు అందజేశారు. ఆ బాలికలు చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఏ అవసరమొచ్చినా సంప్రదించాలని, అన్ని విధాల ఆదుకుంటానని వారికి హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించి, గుడ్డ సంచులు పంపిణీ చేశారు. 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురంలోని బంగారు తల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, సేవలోనే సంతృప్తి పొందుతానని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తితో గత 30 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తోందన్నారు. వచ్చే 40 ఏళ్ల ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగితే ఏపీ నెంబరు వన్ స్థానానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరుతుండడంతో వృద్ధులు, వికలాంగులు సహ అన్ని వర్గాలు ఎంతో సంతోషంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కంచిపాటి జగదీష్, చింతాడ సురేష్, అక్కలనాయుడు, యతిరాజుల రామరాజు, కూన రామరాజు, దుబ్బాకుల ప్రకాష్, బల్ల నాగార్జున, గులివెందుల కృష్ణ, వంకర అప్పారావు, సువ్వాడ శ్రీనివాస్, రామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ ట్రైనింగ్ సలహాదారుగా శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ ట్రైనింగ్, జాబ్ ఫెయిర్ సలహాదారుగా మిలీనియం సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ ఎండీ, చైర్మన్ గాదె శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఈ నెల 17న రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పరిపాలన విభాగం ఉత్తర్వులు జారీచేసింది. గడిచిన 20 సంవత్సరాలుగా అనేక జాబ్ మేళాలు విజయవంతంగా నిర్వహించి, విశేష అనుభవం సంపాదించుకున్న తనపై నమ్మకంతో ఇదే విభాగానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించడంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డికి, పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తీసుకొస్తానని చెప్పారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు పరిధి రామచంద్రనగర్‌లో కార్తీకమాసం సందర్భంగా రామలింగేశ్వర ఆలయం వద్ద వార్డు వైసిపి అధ్యక్షులు పైడి రమణ ఆధ్వర్యాన అన్న సమారాధన నిర్వహించారు. జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపాహానుక్, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్ పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు. వీరు ముందుగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సుమారు 5000 మందికి అన్నదానం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడి నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రౌడీలందరూ కూడా సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని నాలుగో పట్టణ సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివాదాలు, సెటిల్మెంట్‌లో తలదూర్చకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గౌరీ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

పందలపాక సర్పంచ్ దవల నాగేశ్వరరావు

ప్రజాశక్తి -ఆనందపురం: ఇంటింటికీ కుళాయిలు, విద్యుత్ దీపాలు, మౌలిక వసతులు కల్పించి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పందలపాక సర్పంచ్ దవల నాగేశ్వరరావు చెప్పారు. ఏడాదిన్నర పాలనలో అభివృద్ధి పనులను ఆయన వివరించారు. పార్టీలకతీతంగా ఏకగ్రీవంగా గ్రామస్తులు సర్పంచ్‌గా ఎన్నుకున్నందుకు పంచాయతీలో మౌలిక వసతులు కల్పించి మండలంలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సహకారంతో పంచాయతీలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పంచాయతీ పరిధి బాకురుపాలెం, పందలపాక, సీతంపాలెం, గంటాపేట, యాతపేట గ్రామాలలో ఇప్పటికే తన సొంత నిధులు రూ.8.5 లక్షలతో ఇంటింటికీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంటింటికీ కుళాయిలు, పేదవారికి జగనన్న ఇళ్ళు, అర్హులందరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందించడానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీని ఏర్పాటుచేయాల్సి ఉందని, త్వరలో పూర్తిచేసి అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్కసారి ఎమ్మెల్యేతో ప్రారంభ కార్యక్రమం ఏర్పాటు చేస్తానని చెప్పారు.

కాగితాల్లోనే షాదీఖానా..!

★ మంజూరై రెండేళ్లవుతున్నా ముందుకు కదలని పనులు

★ స్వచ్ఛందంగా స్థలం సమకూర్చినా చేపట్టని నిర్మాణం

★ కలగానే మిగిలిపోతుందేమోనని ముస్లిముల ఆవేదన

షాదీఖానా కోసం ముస్లిములు స్వచ్ఛందంగా సమకూర్చిన స్థలం ఇదే

ప్రజాశక్తి -పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ గొల్లగుంట గ్రామానికి ముస్లిములకు మంజూరుచేసిన షాదీఖానా నిర్మాణపనులు రెండేళ్లవుతున్నా చేపట్టకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. 2020 జులై 27న గొల్లగుంటకు షాదీఖానా మంజూరు చేస్తూ మైనార్టీ సంక్షేమశాఖ ఆర్‌టి.నెంబరు 95 ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జిఒ ఇచ్చి రెండేళ్లు దాటినా, మంజూరైన షాదీఖానా కాగితాలకే పరిమితమైందే తపప పనులు జరగలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చొరవతో రావాడ పంచాయతీ గొల్లగుంట గ్రామానికి షాదీఖానా మంజూరుకు కృషి జరిగింది. అప్పట్లో చేసిన ప్రతిపాదనల మేరకు, రంజాన్ తోఫా పంపిణీ సందర్భంగా స్థలాన్ని చూపిస్తే షాదీఖానా నిర్మాణం చేపడతామని చెప్పారని, ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడం, ప్రభుత్వాలు మారి వైసిపి అధికారంలోకి రావడం చకచకా జరిగిపోయాయి.

అయితే అప్పటి ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు మైనార్టీ సంక్షేమ శాఖ రావాడ పంచాయతీ గొల్లగుంట గ్రామంలో షాదీఖానా నిర్మాణానికి రూ.15లక్షలు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఉత్తర్వులైతే వెలువడ్డాయేగానీ, పనులు మాత్రం ఇంతవరకు చేపట్టలేదు. గత ప్రభుత్వహయాంలో చేసిన ప్రతిపాదనలు కావడం వల్ల వెనక్కు పెట్టారా? లేక మరేమైనా కారణం ఉందో తెలియనప్పటికీ, నిధులు మంజూరై రెండేళ్లు గడిచినా పనుల్లో ఎటువంటి కదలిక లేకపోవడంపై స్థానిక ముస్లిములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లగుంట గ్రామంలో దాదాపు 100 ముస్లిం కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారికి వివాహం, ఇతర శుభకార్యాలు, సమావేశాలకు గ్రామం లో సరైన భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి, గొల్లగుంట గ్రామానికి మంజూరైన షాదీఖానా నిర్మాణాన్ని ప్రారంభించి, పూర్తిచేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

మాటల్లోనే ముస్లిముల సంక్షేమం?

రాష్ట్రం ప్రభుత్వం ఇటీవలే మైనార్టీల దినోత్సవం నిర్వహించింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఏమేమి పనులు చేసిందో, ముస్లిముల కోసం ఎన్ని వేల కోట్లు ఖర్చు చేసిందీ ముస్లిములతో ఏర్పాటు చేసిన సభలో చెప్పుకొచ్చారు. కానీ గొల్లగుంటలోని పరిస్థితులను చూస్తే, ముఖ్యమంత్రి చెప్పినదానికి, ఇక్కడ జరిగిన ముస్లిముల సంక్షేమానికి ఎక్కడా పొంతన కనబడడం లేదని స్థానికులు అంటున్నారు. అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం, పాలకులతోపాటు చివరకు అధికారులు కూడా షాదీఖానా నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. గొల్లగుంట గ్రామంలో షాదీఖానా నిర్మాణం కలగా మిగిలిపోకుండా చూడాలని వేడుకుంటున్నారు.

ఎంపిడిఒ వివరణ

దీనిపై పరవాడ ఎంపిడిఒ వి.హేమసుందరావును ప్రజాశక్తి వివరణ కోరగా, గొల్లగుంట షాదీఖానా గురించి తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనే జిఒ ఇచ్చినప్పటికీ, కొన్ని అభివద్ధి కార్యక్రమాలు సంబంధిత శాఖల ద్వార జరిగిపోతున్నాయని, షాదీఖానా విషయమై జిల్లా మైనార్టీ సంక్షేమశాఖను సంప్రదించాల్సి ఉందన్నారు.

జెవివి ఆధ్వర్యాన చెకుముకి పోటీలు

విజేతలకు బహుమతులిస్తున్న జెవివి ప్రతినిధులు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాడుగుల, చీడికాడ, బుచ్చయ్యపేట మండలాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం మాడుగుల వీనస్ కోచింగ్ సెంటర్‌లో చెకుముకి పోటీలను నిర్వహించారు. .పాఠశాల స్థాయిలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు ధ్రువపత్రాలను, బహుమతులను జన విజ్ఞాన వేదిక సభ్యులు అందజేశారు. బుచ్చయ్య పేట మండలం నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఆడారి.మోహన ప్రియ, తమరపల్లి హేమన్య, చింతాడ గోవింద్,వై.గగన్ తేజ , జి. అమృత, సిహెచ్ చంద్రిక, గాడి భవానీ, గంట శ్రీదేవి, కట్టోజు మేఘన ఎంపికయ్యారు.కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్షులు సురేష్ శాంతో, ప్రధాన కార్యదర్శి తాలపురెడ్డి నాగ చంద్ర, కార్యదర్శి గౌరిపట్టపు మహేష్, ఉపాధ్యక్షులు జాగాబు ఈశ్వరరావు, కోశాధికారి గొట్టాపు చిన్నం నాయుడు పాల్గొని, జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌ఒ

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చేనెల 8వరకు జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ కోరారు. ఆదివారం స్థానిక జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.. ఈ సంరద్భంగా మాట్లాడుతూ, 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. మండలాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ, అలాగే ఆన్‌లైన్‌లోనూ ఓటర్ల నమోదు, సవరణకు అవకాశం ఉందన్నారుకార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీరామ్మూర్తి, ఆర్ఐ రమేష్, ఎన్నికల సీనియర్ సహాయకులు, విఆర్‌ఒలు శేషగిరి, ఎవి గణపతి పాల్గొన్నారు.

ఎంవిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన పేదలకు ఉచిత తీర్థయాత్రలు

బస్సులను ప్రారంభిస్తున్న ఎంవిఆర్ సతీమణి సూర్యకుమారి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో దూసుకుపోతున్న ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ట్రస్ట్ ఆధ్వర్యాన పేదలకు ఉచిత తీర్థయాత్రల దర్శనాన్ని కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో వివిధ మండలాలకు చెందిన 300మందిని ఆరుబస్సుల్లో తీర్థయాత్రలకు తీసుకెళ్లే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం నరసింగరావుపేట ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయం వద్ద తీర్థయాత్రల బస్సులను ఎంవీఆర్ సతీమణి సూర్య కుమారి, తనయుడు సతీష్ జెండా ఊపి ప్రారంభించారు. తమకు తీర్థయాత్రలను దర్శించుకునే అవకాశం కల్పించిన ఎంవిఆర్ ట్రస్ట్‌కు వారంతా కృతజ్ఞతలు తెలిపి, అభినందించారు.

వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : ప్రమాదవశాత్తు కాలు పోగొట్టుకున్న మండలంలోని తురకలపూడి గ్రామం జనసైనికుడు వెంకటప్రసాద్‌కు చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పివిఎస్ఎన్ రాజు తన సొంత నిధులతో సమకూర్చిన వీల్‌చైర్‌ను అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు డిఎస్.నాయుడు, తదితరులున్నారు.

బాధితునికి వీల్‌చైర్ అందజేస్తున్న రాజు

21వ రోజుకు నేవల్ బేస్ నిర్వాసితుల ఆందోళన

ఆందోళనలో పాల్గొన్న నేవల్ బేస్ నిర్వాసితులు

ప్రజాశక్తి - రాంబిల్లి : తమ సమస్యల పరిష్కారాన్నికోరుతూ నేవల్ బేస్ నిర్వాసితులు చేపడుతున్న ఆందోళన ఆదివారానికి 21వ రోజుకు చేరుకుంది. వందలాదిమంది నిర్వాసితులు ఎన్ఎఒబి మెయిన్ గేట్ ముందు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. నేవీ గేట్‌లను వెంటనే తీయాలని, ఆధార్ కార్డు ఆధారంతో నిర్వాసితులను లోపలికి పంపించాలని, జెట్టీ నిర్మాణ పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని, పెండింగ్ ప్యాకేజీలు వెంటనే క్లియర్ చేయాలని, మగవాళ్లతో సమానంగా మహిళలకు ప్యాకేజీ ఇవ్వాలని, నేవల్ బేస్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని కోరారు. నిర్వాసితుల సమస్యలపై తక్షణం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎనిమిది గ్రామాలు నిర్వాసితులు, జెఎసి పెద్దలు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో పరవాడలో..

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : పరవాడలో డిసెంబర్ 18, 19 తేదీల్లో జరిగే సిఐటియు అనకాపల్లి జిల్లా 12వ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో మహాసభల వాల్‌పోస్టర్లను సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు, జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు, అసంఘటితరంగ కార్మికులు, స్కీం వర్కర్లు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించి, వారికి సౌకర్యాలను కల్పించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, కార్మిక హక్కులను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్మిక ఉద్యమాలు, పోరాటాలపై నిర్బంధాన్ని ప్రయోగించడం బాధాకరమన్నారు. 11ఏళ్లుగా వేతన సవరణ జరగక, కనీస వేతనాలకు నోచుకోక జిల్లాలో మూడు లక్షల మంది కార్మికులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలలో పనిచేసే అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, ఐకెపి, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస హక్కులు, ఉద్యోగభద్రత లేదని, దీనిపై రానున్న రోజుల్లో సిఐటియు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి స్వరూపరాణి పాల్గొంటారన్నారు.

భారీ అన్నసమారాధన

అన్నసమారాధనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ

ప్రజాశక్తి - అనకాపల్లి : స్థానిక లక్ష్మీదేవి పేట శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన భారీ అన్న సమారాధనను మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర ప్రారంభించారు. ముందుగా జగదీష్‌ను ఆలయ కమిటీ స్వాగతం పలికింది. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం బుద్ధను సత్కరించారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బొద్ధపు ప్రసాద్, శంకర్ల పద్మలత, సందీప్, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు పెంటకోట శ్రీనివాసరావు, విగ్రహ దాత పెంటకోట సురేష్‌బాబు పాల్గొన్నారు.

హామీల అమలును ప్రశ్నిస్తే అణచివేత దుర్మార్గం

ఉపాధ్యాయ బదిలీలను తక్షణమే చేపట్టాలి

విద్యాశాఖపై అవగాహన లేని మంత్రి బొత్స రాజీనామా చేయాలి

టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్

.మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి -అనకాపల్లి : విద్యాశాఖపై అవగాహన లేని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తక్షణమే రాజీనామా చేయాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీలను ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని కోరారు. ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభంలో బదిలీలు ఉంటాయని చెప్పిన మంత్రి బొత్స, ఇప్పటివరకు ఎందుకు చేపట్టలేదో చెప్పాలన్నారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి, ఉద్యోగులు, ఉపాధ్యాయులను మభ్యపెట్టి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇపుడు అసాధ్యమంటూ చేతులెత్తేయడం, కమిటీల పేరుతో కాలయాపన చేయడం సమంజసం కాదన్నారు. విపక్షంలో ఉన్నపుడు ఉద్యోగుల పెండింగ్ డిఎలపై హంగామా చేసిన సిఎం జగన్, ఇపుడు ఉద్యోగులు, ఉపాధ్యాయులు వాటికోసం ఉద్యమిస్తుంటే పోలీసులతో అణచివేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ఎన్నికలకు ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు కోరితే, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వాటికి గొంతెమ్మ కోరికలంటూ ఎద్దేవా చేయడం బాధాకరమన్నారు. ఇటువంటి అసమర్ధ ముఖ్యమంత్రి, మంత్రులను గతంలో ఏ ప్రభుత్వంలో లేదని, దీనిపై తగిన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు ధనాల విష్ణు చౌదరి, కొణతాల వెంకటరావు పాల్గొన్నారు.

250 మందికి ఉచిత పరీక్షలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం: సురక్షా హెల్త్ ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా విష్ణు హాస్పిటల్, కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం అచ్యుతాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె సంబంధిత సమస్యలకు ఉచితంగా ఇసిజి, ఇతర పరీక్షలు చేశారు. కీళ్ల వాపులు మధుమేహం, అధిక రక్తపోటు, దంత సమస్యలు, చర్మ వ్యాధులు, జుట్టు ఊడిపోవడం తదితర రుగ్మతలతో వైద్యశిబిరానికి వచ్చిన 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు బాలాజీనగర్ వైసిపి కార్యాలయంలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో వైసిపి నాయకులు ఇజ్జాడ సత్యనారాయణ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆరిలోవ పరిసర ప్రాంతాల నుంచి సుమారు 201 మందికి కేన్సర్ స్క్రీనింగ్, 106 మందికి ఈసీజీ, 322 మందికి బిపి, వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.కార్యక్రమంలో మెడికవర్ వైద్యులు, సిబ్బంది, వార్డు వైసిపి నేతలు పాల్గొన్నారు.

పార్కులో వ్యాయామ పరికరాలు

వ్యాయామ పరికరాల ప్రారంభంలో అప్పలరాజు తదితరులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పి.ఎం.పాలెం హెచ్‌పిసిఎల్ లే-అవుట్‌లోని పార్కులో వ్యాయామ పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు వైసిపి అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు మాట్లాడుతూ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక ఆదేశాల మేరకు అభివృద్ధిలో భాగంగా రూ.9.90 లక్షలు జివిఎంసి నిధులతో పార్కు గోడలకు పెయింటింగ్, నీటి సరఫరా, డస్ట్ బిన్స్, వాకింగ్ ట్రాక్ మరమ్మతుల పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు గాడె రోషిరెడ్డి, ఇఎన్ఎస్ చంద్రరావు, గుంటుబోయిన సంజీవ్, షియద్రి కనకరాజు, పోతిన సూరిబాబు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విసిసి ఆటల పోటీలు

ప్రజాశక్తి-గాజువాక: జివిఎంసి 65వ వార్డు పరిధి బానోజీతోటలో విసిసి ఆధ్వర్యాన పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు ఆర్.నాగేశ్వరరావు, విసిసి ప్రతినిధులు ఆర్.సత్యవేణి, టి.లక్ష్మి, ఆర్.నందిని, టి.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు

మండల కేంద్రాల్లో టిడిపి కార్యాలయాలు : పైలా

ప్రజాశక్తి- కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రం మాడుగులతోపాటు దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు మండల కేంద్రాల్లో టిడిపి కార్యకర్తలకు, నాయకులు సమావేశాలు, ఇతర కార్యకలాపాలకు వీలుగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయా మండలాల నాయకులు, కార్యకర్తల నుంచి వచ్చిన సూచనలు, సలహాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ కేడర్ మధ్య సమన్వయం, అధిష్టానం పిలుపు మేరకు చేపట్టాల్సిన కార్యక్రమాలకు వేదికలుగా ఈ కార్యాలయాలను తీర్చిదిద్దనున్నామన్నారు. పార్టీలో చురుకుగా పనిచేసే నేతలు, కార్యకర్తలను వీటిలో భాగస్వామ్యం చేయనున్నట్లు పైలా వెల్లడించారు. తాను నిరంతరం కార్యాలయాల్లో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండి, పనిచేయడం ద్వారా వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో టిడిపి విజయానికి అందరినీ కలుపుకుని సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, టిడిపి విజయానికి పనిచేద్దామన్నారు.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సత్యాంజనేయ

ప్రజాశక్తి - ములగాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని సిపిఐ పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ పేర్కొన్నారు. మల్కాపురం గ్రామ మండలిలో పశ్చిమ నియోజకవర్గం సిపిఐ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యాంజనేయ మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పశ్చిమ నియోజకవర్గం సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, గండి అప్పారావు, ఎన్‌వి త్రినాథ్, రామకృష్ణ, కనకరాజు, గుడాల జయ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి- పిఎం పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో సిద్ధేంద్రయోగి నాట్యాలయంచే శాస్త్రీయ, జానపద నృత్యాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా గణనాయక, ఐగిరి నందిని, ముద్దుగారే యశోద, తిరుతిరు గణనాథ, రాజాం కొండ మీద, మొక్క జొన్న తోటలో, నోము నోమన్నల, కోయిలారే, గాజుల చప్పుడు తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు శాన్వి, గామిని, శ్రీవల్లి, హాస్య, అక్షర, కీర్తి, పల్లవి, మోక్ష, సంజన, మౌనిక, సంధ్య, మన్విత, కుషాల్, చందు, కోమల, లలిత్, యశశ్విని నృత్యాలను ప్రదర్శించారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్మిర్ధ శ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ చంద్ర మూర్తి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాధరావు, టిజె మోహన్ రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాస రావు, సభ్యులు రాంబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మివానిపాలెంలో అంబలం పూజ

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పి.ఎం.పాలెం సమీపంలోని లక్ష్మివానిపాలెంలో అనూష కేటరింగ్ అధినేత, ఆరో వార్డు వైసిపి నాయకులు పోతిన ప్రసాద్ స్వామి, పోతిన నరేష్ గురుస్వామి ఆధ్వర్యాన అయ్యప్ప అంబళంపూజ నిర్వహించారు. వేలాది మంది అయ్యప్ప భక్తులతో పూజ ప్రాంగణం కిటకిటలాడింది. అయ్యప్ప స్వాములందరూ ఆనందంతో చప్పట్లు కొడుతూ భక్తి పాటలు పాడారు. అనంతరం బొట్ట అప్పలరాజు, గుంటుబోయిన సంజీవ్, దాసరి శ్రీనివాస్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, సంతోష్ నాయుడు, వంద్రసి వెంకటపురావు, చంటి నరేష్ గురుస్వామి, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

రచయితలకు సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి కవులకు పుట్టినిల్లని పలువురు కొనియాడారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో అనకాపల్లికి చెందిన కవయిత్రులు స్వాతీకృష్ణ రచించిన మౌనమేఘాలు, రాయవరపు సరస్వతి రచించిన ఆశల పల్లకి పుస్తకాలను లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు రచయిత్రులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ బల్ల నాగభూషణం, సాహితీ కవులు ఇమిడిసెట్టి చక్రపాణి, రంగబాబు, అమర జ్యోతి, మల్లీశ్వరి, నాగలక్ష్మి, జివిఎస్ఎన్ శాస్త్రి, కోరాడ అప్పలరాజు, బుద్ధ వీరునాయుడు, లక్ష్మీనారాయణ, భాషా, త్రినాధరావు పాల్గొన్నారు.

పంచముఖేశ్వరుని సన్నిధిలో అమర్

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని శిరంశెట్టివానిపాలెంలోని ఉమా సహిత పంచముఖేశ్వర ఆలయాన్ని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌ను ఆలయ కమిటీఘనంగా స్వాగతించి, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్తీక బహుళ ఏకాదశి పురస్కరించుకొని ఆలయంలో సామూహిక గౌరీ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, కశింకోట ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, మలసాల కిషోర్, గొల్లవిల్లి శ్రీనివాసరావు, భీశెట్టి జగన్ పాల్గొన్నారు.

నేడు బోదువలసలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి.- సబ్బవరం : మండలంలోని బోదువలస గ్రామంలో ఈ నెల 21న సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు తెలిపారు. నేబర్తి సాయికిరణ్, సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈనేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, కంటి సమస్యలతో బాధపడే పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తారన్నారు. శిబిరానికి వచ్చే రోగులు ఆధార్, ఆరోగ్యశ్రీకార్డు, ఫోన్ నెంబరు, అదనంగా ఒక జత బట్టలను తమ వెంట తీసుకురావాలని కోరారు.

33 పశువులతో కంటైనర్ స్వాధీనం

పోలీసులు పట్టుకున్న పశువుల కంటైనర్

ప్రజాశక్తి- కశింకోట :కంటైనర్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 33 పశువులను పట్టుకున్నామని అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో తాళ్లపాలెం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, ఎమ్.హెచ్ 43 వై 7936 నెంబర్ గల కంటైనర్ లారీలో 33 ఎద్దులను తరలిస్తుండగా పట్టుకున్నామని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను గోశాలకు తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని మూలపేట గ్రామంలో గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం స్థానిక సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేలవేషాలు, కోలాటాలు, చిటికెలు, సేవాగరిడీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, నిమజ్జనం చేశారు. ఊరేగింపులో వైవిధ్యభరితమైన వివిధ దేవతామూర్తుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పెరుగుతున్న చలి తీవ్రత

ప్రజాశక్తి - కశింకోట : వాతావరణ మార్పులతో మండలంలో గడచిన రెండు రోజులుగా చలి తీవ్రత బాగా పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో చల్లని గాలులు వీస్తూ, వణికిస్తుండడంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఇంటికే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది. చలితీవ్రతతో కొండ ప్రాంతంలో నివాసమంటున్న వారంతా ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

బహుమతులు ఇస్తున్న ఎస్ఐ

విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం
విశాఖ, అనకాపల్లి జిల్లాలోని పలు శాఖాగ్రంథాలయాల్లో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిసాయి. వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ పోటీల్లోవిజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

ప్రజాశక్తి–చీడికాడ:మండల కేంద్రంలో శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ఆ శాఖాధికారిని జోగేశ్వరి ఆధ్వర్యాన ముగిశాయి. స్థానిక ఎస్ఐ కే.సుధాకర్, పాల సంఘం అధ్యక్షులు పరవాడ అప్పారావు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రంథాలయాలలో విద్యార్థులకు ఎంతో విలువైన సమాచారం దొరుకుతుందని తెలిపారు. ఆకాష్ విద్యా విహార్ ప్రిన్సిపాల్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, బండారు చారిటబుల్ ట్రస్ట్ అధినేత బండారు గోవిందరావు హాజరయ్యారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు శ్రీదేవి, రంగబాబు, ఫాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో గ్రంథాలయ అధికారి గోవింద ఈశ్వరరావు ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ జయ రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ముఖ్యఅతిథిలు గా హాజరయ్యారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులు నాగేశ్వరరావు, అప్పారావు, రాంబాబు, తాతాజీ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకరాజు మాస్టారు, సుగుణ, సత్యనారాయణ, మస్తాన్, రాజ్యలక్ష్మి, రాఘవ కుమారి పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక శాఖ గ్రంథాలయంలో విజేతలకు ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ వరలక్ష్మి బహుమతులు అందజేశారు. నవంబర్ 14నుండి 20వ చదరంగం, క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్.వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్ల: గ్రంధాలయాలు విజ్ఞాన బాండాగారాలని జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు వైస్ ఎంపీపీ దత్తుడు రాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సిద్ధ బత్తుల సత్తిబాబు, దాసరి వెంకట్రావు, డివి యువసేన అధ్యక్షులు చామంతుల శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ములగాడ : గ్రంథాలయాల ద్వారా వ్యక్తిత్వం వికసిస్తుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో ముగింపు వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, కార్మిక సంఘం నాయకులు బి.సత్యానందం, ప్రముఖ న్యాయవాది జికెవి. రాజు, సామాజిక కార్యకర్త టి.శ్రీరామ్మూర్తి, పాత్రికేయులు ఎస్.చలపతిరావు మాట్లాడారు. వీరందరిని గణబాబు మెమెంటోలతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

మాధవధార : నేటి సమాజంలో ప్రజలకు గ్రంథాలయాలు ఎంతో అవసరమని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. మాధవధార ఎంఎంఆర్ పార్కు గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. పార్క్ అధ్యక్షులు ఎ.నారాయణరావు, కార్యదర్శి జివిఆర్ మూర్తి, ఉపాధ్యక్షులు ఎస్ఎస్.రావు, కోశాధికారి చంద్రశేఖర్, వై.నూకరాజు, కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ మూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన ముగింపు సభలో అతిథులుగా మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు టి భీమారావు, ఎస్.ఆనందరావు, డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు శాఖా గ్రంథాలయాధికారి మహేష్ బహుమతులు అందజేశారు.

చోడవరం : జాతీయ రగంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలైన విద్యార్థులకు ఎంపిపి గాడి కాసు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయ అధికారిని జి తిరుమలకుమారి పాల్గొన్నారు.

కశింకోట: తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు ఎంపిటిసి లగిశెట్టి భవాని బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గురుకులం వైస్ ప్రిన్సిపాల్ ప్రేమానంద్, లైబ్రేరియన్ యం.భారతీదేవి పాల్గొన్నారు.కశింకోట శాఖాగ్రంథాలయంలో వైస్ఎంపిపి పెంటకోట జ్యోతి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు మళ్ళ రాము, బొడ్డేడ అప్పారావులను సన్మానించారు.

సబ్బవరం : గ్రంథాలయ సేవలను వినియోగించుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంపిపి బోకం సూర్యకుమారి అన్నారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సిఐ పి.రంగనాథం, ఎస్ఐ ఎల్.సురేష్, మాజీ జెడ్‌పిటిసి కోటాన రాము, లైబ్రేరియన్ పివి.రమణ పాల్గొన్నారు.

కె.కోటపాడు: కె.కోటపాడు, చౌడువాడ శాఖాగ్రంథాలయాల్లో వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. చౌడువాడలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపిటిసి. ఏటుకూరి రాజేష్ బహుమతులు అందించారు.

మునగపాక రూరల్: మునగపాక శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎల్‌వి.రమణ ఆధ్వర్యంలో వివిధ పోటీల్లో విజేతలకు ఎంపిపి మళ్ల జయలక్ష్మి. సర్పంచ్ దిమ్మల అప్పారావు బహుమతులు అందించారు.ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గాప్రసాద్‌ను సత్కరించారు.

ఎమ్మెల్యేకు గజమాల వేస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి–నర్సీపట్నం టౌన్: స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ జన్మదిన వేడుకలు శనివారం అర్ధ రాత్రి 12 దాటిన తర్వాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం కౌన్సిలర్లు, కార్యకర్తలు, నాయకులు తండోపతండాలుగా రాత్రి 12 గంటలకే ఎమ్మెల్యే ఇంటికి చేరుకొని పుట్టినరోజు వేడుకలు ప్రారంభించారు. స్థానిక కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, బోడపాటి సుబ్బలక్ష్మి, మున్సిపల్ ఛైర్పర్సన్ ఆదిలక్ష్మి తదితరులు వేద పండితులతో ఎమ్మెల్యే గణేష్‌కు ఆశీర్వాదాలు అందించారు. గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల ఎమ్మెల్యే కాలికి దెబ్బ తగలడంతో వీల్ చైర్ మీద నుంచే వేడుకలు జరపడంతో కార్యకర్తలు కొంత ఆవేదనకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో రక్తదానాలు, ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

రక్తదానం చేస్తున్న దాతలు

చీడిగుమ్మలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి–గొలుగొండ:నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రావణాపల్లి పంచాయతీ నుంచి పలువురు రక్తదానం చేశారు. ఈ శిబిరంలో 35 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, పిఏసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎంసి ఛైర్మన్ కొల్లు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, కొమిర సర్పంచ్ అల్లు రాజుబాబు, గుండుపాల సర్పంచ్ జోగా రామకృష్ణ, నాగపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ్, సత్యనారాయణ, కొల్లు రాజునాయుడు పాల్గొన్నారు.

తీరంలో ఉన్న మహిళలు

తీరంలో సందడి

ప్రజాశక్తి –నక్కపల్లి :మండలంలో తీర ప్రాంతాల్లో ఆదివారం సందడి నెలకొంది. రాజయ్యపేట, బోయపాడు సముద్ర తీరాలు జనంతో కళ కళలాడాయి. పలు ప్రాంతాల నుంచి జనం బస్సులు, ఇతర వాహనాల్లో తీర ప్రాంతాలకు చేరుకుని సందడి చేశారు. ఆటలు, పాటలతో పెద్దలు, విద్యార్థులు ,చిన్నారులు సందడిగా గడిపారు. ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పిక్నిక్ సందడి కనిపించింది. ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు.

బాధితురాలికి పరామర్శ ఏదీ?

ప్రజాశక్తి–గొలుగొండ: కొత్త ఎల్లవరం గ్రామంలో ఒంటరి మహిళ బాధితురాలును పరామర్శించేందుకు వైసిపి నాయకులు ఎందుకు రాలేదని కొత్తఎల్లవరం సర్పంచ్ రాంబాబు ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, కొత్త ఎల్లవరం గ్రామంలో ఇరిగేషన్ స్థలంలో పూరిల్లు కట్టిందనే పేరుతో పావాడ వెంకటలక్ష్మికి చెందిన పూరిగుడిసెను రెవెన్యూ, పోలీసు అధికారులు కూలగొట్టిన విషయం తెలిసిందే. ఆమెను వైసిపి నాయకులు ఎందుకు పరామర్శించ లేదన్నారు. ఇప్పుడు మాత్రం కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారన్నారు.

ఓటరు నమోదు శిబిరం

ప్రజాశక్తి–గొలుగొండ:ఓటర్ నమోదు స్పెషల్ క్యాంపెయిన్ డ్రైవ్ సందర్భంగా ఆదివారం గొలుగొండ మండలం ఏఎల్‌పురం హైస్కూల్లో బిఎల్ఓ శ్రీధర్ ఆధ్వర్యంలో కొత్త ఓటర్ల నమోదు చేపట్టారు. ఈ కేంద్రాన్ని ఆర్ఐ నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ కార్డులో సవరణలు, ఓటర్ కార్డుకు ఆధార్ కార్డ్ అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు.

ధ్రువ పత్రాన్ని ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది

జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి –కోటవురట్ల:మండల వ్యాప్తంగా జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మానాలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ అన్నారు ఆదివారం అన్నవరం ఎండపల్లి గ్రామాలను సందర్శించి కేటాయించిన జగన్ అన్న కాలనీ స్థలాలను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు, కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ , అన్నవరం సర్పంచ్ సుబ్బలక్ష్మి, కార్యదర్శి సతీష్,ఎండపల్లి సర్పంచ్, హౌసింగ్ ఇంజినీరు జగదీశ్వరరావు గ్రామ రెవెన్యూ అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

చలి తీవ్రతతో అవస్థలు

ప్రజాశక్తి–పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మన్యంలో ఆరు రోజులుగా చలి తీవ్రత అధికమైంది. ప్రజలు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత ఎక్కువైంది. పొగ మంచు దట్టంగా కురుస్తుంది. పొగ మంచుతో రహదారులపై వాహన రాకపోకలు అంతరాయం కలుగుతోంది. ఎదుట వాహనాలు కనిపించక పోవడం తో వాహన చోధకులు లైట్లు వేసుకొని ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఉదయం 10 గంటల వరకు కూడా చలి తీవ్రత తగ్గక పోవడంతో మన్యం వాసులు పనులకు ఇంటి నుంచి బయటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, అప్పలరాజు

మత్స్యకారులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి–నక్కపల్లి:మత్స్యకారులకు న్యాయం జరిగే వరకు అండగా ఉండి పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. హెటిరో పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహాధర్నా ఆదివారం నాటికి 356వ రోజుకు చేరింది.పైప్ లైన్‌కు కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు అప్పలరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెటిరో వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి మత్స్యకారులు ఉపాది కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెటిరో కంపెనీ వేసిన కొత్త పైప్ లైన్ పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్తులో కూడా కొత్త పైపులైనుకు అనుమతులు ఇవ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.రాజేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వాసుపల్లి నూకరాజు, కోడా కాశీరావు, మైలపల్లి జాన్, మైలపల్లి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులపై ఉధృత పోరాటాలకు సిద్ధం

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి-పెందుర్తి: కార్మిక హక్కులపై ఉధృత పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. సిఐటియు పెందుర్తి జోన్ మూడో మహాసభను కార్మిక నగర్ సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా సిఐటియు పతాకాన్ని సీనియర్ నాయకులు సూర్యప్రకాష్ ఆవిష్కరించారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి సిఐటియు సీనియర్ నాయకులు ఇంగ్లీష్ రమణ, భాషా పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన అధికారంలోకి రావాలనే ఆలోచనలో ఉన్నారే తప్ప కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలేదని విమర్శించారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని కారు చౌకగా అమ్మేస్తూ, ప్రజలపై అనేక భారాలు వేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వ రంగం సంస్థలే కీలకమని, వాటి రక్షించుకోవాలన్నారు. కార్మిక చట్టాలను లేబర్ కోడ్లుగా మార్చారని, వాటిని రద్దుచేయాలని, అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ ఇతర చట్టాలను చిన్న పరిశ్రమలు అమలుచేసేలా చూడాలని, బిల్డింగ్ కార్మికులకు సంక్షేమ బోర్డులోని సౌకర్యాలు అమలు చేయాలి డిమాండ్ చేశారు. ఇంటి పని కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆశ, అంగన్‌వాడీ, మిడ్ డే మీల్ కార్మికులకు ఉద్యోగ భద్రతకల్పించాలని కోరారు.

జోన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు నివేదిక ప్రవేశ పెట్టారు. గత మూడేళ్లలో చేసిన ఉద్యమాలను, పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. ఈ మహాసభలో సిఐటియు నగర కార్యదర్శి బి.జగన్, ఐద్వా జోన్ కార్యదర్శి లావణ్య, నాయకులు రమణి, ప్రజానాట్యమండలి నాయకులు మౌలాలి, ఆశ, అంగన్‌వాడీ, భవన, తోపుడు బళ్లు, మోటార్ ఆటో రంగాల కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

నూతన కమిటీ ఎన్నిక

సిఐటియు పెందుర్తి జోన్ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎస్.శంకరరావు, జి.శంకరరావు, కోశాధికారిగా జగన్నాథస్వామి, కార్యదర్శివర్గ సభ్యులుగా కె.అప్పలనాయుడు, కె.అప్పారావు, ఎ.శ్రీను, కమిటీ సభ్యులుగా 27 మందిని ఎన్నుకున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

జగనన్న క్రీడా సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:జగనన్న క్రీడా సంబరాలు 2022 పోస్టర్‌ను ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇంత వరకూ స్పోర్ట్స్ క్రీడాకారులకు లక్షల్లో నగదు బహుమతులు ఇవ్వడం ఇదే ప్రథమన్నారు. ఐదు ఆటల్లో రూ.50 లక్షల ప్రైజ్ మనీ ఇస్తున్నారన్నారు. గ్రామానికి క్రీడా క్లబ్బు ప్రారంభించి అందులో క్రీడాకారులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రోత్సహిస్తుంచడం అభినందనీ యమ న్నారు. సీఎం జగన్ జన్మదినం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో మూడు ఆటల పోటీల్లో ఐదు టీములు జిల్లాకు వెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యా పారవేత్త వెలగా నారాయణరావు, శాప్ కోచ్ అబ్బు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పర్యవేక్షకుడు కృష్ణతో టిడిపి నాయకులు

నియోజకవర్గ నేత ఎవరు ?

- అయోమయంలో ఉన్నాం
- టిడిపి సమావేశంలో కార్యకర్తలు

ప్రజాశక్తి-చీడికాడ:ఇప్పటికే మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో రానున్న ఎన్నికల్లో అభ్యర్థి ఎవరనేది తెలియక సతమవుతున్న నేపథ్యంలో దీనికి తెరదించేందుకు తెలుగుదేశం పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం మండలంలో జి.కొత్తపల్లిలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాడుగుల నియోజకవర్గం పర్యవేక్షకుడు లోడగల కృష్ణ హాజరయ్యారు. ఈ సమావేశానికి హాజరైన టిడిపి కార్యకర్తలు మండలంలో పార్టీలో ఉన్న ప్రస్తుత విభేదాలు, పరిస్థితులను కృష్ణకు వివరించారు. ఇప్పటివరకు నియోజకవర్గ నాయకుడు ఎవరో తెలియక సతమతమవుతున్నామని, మాడుగుల నియోజవర్గ శాసనసభ సభ్యులు ఎవరని, తెలియక పార్టీ అయోమయకములో ఉందని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని లోడగల కృష్ణకు కార్యకర్తలు నాయకులు కోరారు. దీనికి సంబంధించి అధినాయకుడు చంద్రబాబుకి వివరిస్తానని అప్పటివరకు కార్యకర్తలు, మండల నాయకులు నియోజకవర్గ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి మాడుగుల ఇన్చార్జి పివిజి కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మండల పార్టీ కన్వీనర్ చిన్నమనాయుడు, నాయుడు, వనాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కొత్తకోట:కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్తకోట టౌన్‌లో ఈనెల 21న సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు రావికమతం మండల విద్యుత్ శాఖ ఏఈ నందన్ ఓ ప్రకటనలో తెలిపారు. గత కొన్నాళ్లుగా టౌన్ పరిధిలో తరచూ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని; దీన్ని సరి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కొత్తగా విద్యుత్ స్తంభాల మార్పు, కొమ్మలు తొలగింపు, ట్రాన్స్ ఫార్మర్ మర్మత్తులు చేయనున్నట్లు తెలిపారు.

ఎక్కడి నిర్మాణాలు అక్కడే!

అర్ధాంతరంగా నిలిచిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలు

పిల్లర్ దశలో ఉన్న 1వ ఆర్‌బికె కేంద్రం

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోటలో ప్రభుత్వ భవనాల పనులు నత్త నడకన సాగుతున్నాయి. ప్రభుత్వం కోట్ల నిధులతో నిర్మాణం చేపడుతున్న సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు సాగుతునే ఉన్నాయి.

మండలంలో సుమారుగా అన్ని సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణ పనులు పూర్తి కావచ్చి ప్రారంభానికి సిద్దంగా ఉన్నాయి. కొత్తకోటలో మాత్రం ఇంకా నిర్మాణ పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అనే మాదిరి గానే ఉంది. గ్రామంలో సుమారు 22 వేలకు పైగా జనాభా కలిగి ఉండటంతో పరిపాలనా సౌలభ్యం కోసం మూడు సచివాలయాలతో పాటు మరో మూడు రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. ఒక్కో సచివాలయ భవనానికి రూ.42 లక్షలు, ఒక్కో రైతు భరోసా కేంద్ర భవనాలకు సుమారు రూ.26 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో స్థానిక కాపుల దిబ్బ ఇందిరా నగర్‌లో ఒకటవ సచివాలయం భవనంతో పాటు శివాలయం సమీపంలో బందుల దొడ్డి వద్ద ఒకటోవ రైతు భరోసా కేంద్రం భవనం నిర్మాణం కోసం స్థలాలు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఒక్కో సచివాలయ భవనం రెండు విభాగాలుగా విభజించారు. కిందభాగాలు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు మిగిలిన పనులు మధ్యలో నిలిపి వేశారు. రైతు భరోసా భవన నిర్మాణ పనులు పునాది స్థాయిలోనే ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ స్థలం తమది అంటూ నిర్మాణం అడ్డు కోవడంతో కొంత కాలం పాటు భరోసా కేంద్రం పనులు నిలిచి పోయాయి రెండవ సచివాలయం భవన నిర్మాణాన్ని వెల్లంకి వీధి సమీపంలో మాకవరపాలెం రోడ్డు వద్ద కింద కార్యాలయ విభాగం నిర్మాణ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ రెండవ కార్యాలయం పనులు మధ్యలో నిలిచి పోయింది. దీంతో, ఆ భవనంలో మద్యం బాబులు రాత్రి వేళల్లో అడ్డాగా మార్చు కున్నారు. రైతు భరోసా కేంద్ర భవనం నిర్మాణ పనులకు సంబంధించి నిర్మాణ పనులు కోసం కేటాయించిన స్థలంలో గోతులు తవ్వి వదిలేసారు. స్థానికులు బహిరంగ మల విసర్జనకు ఉపయోగిస్తున్నారు. మూడవ సచివాలయం భవన నిర్మాణానికి స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో బిఎన్ రోడ్డు వద్ద స్థలం కేటాయించారు. సచివాలయం భవన నిర్మాణ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు గోడలు స్థాయి వరకూ నిర్మాణం చేసి వదిలేసారు. రైతు భరోసా కేంద్ర భవనం నిర్మాణం కోసం కేటాయిం చిన స్థలం తమది అంటూ కొత్తకోట

పనులు నిలిచి 3వ సచివాలయం భవనం

ఖాళీగా ఉన్న 2వ ఆర్‌బికె కేంద్రం స్థలం

గ్రామానికే చెందిన ఉగ్గిన వారి కుటుంబం కోర్టు నుంచి స్టే తెచ్చు కోవడంతో నిర్మాణ పనులకు గండి పడింది. గ్రామంలో ఒక అభివృద్ధి నిర్మాణ పని కూడా ముందుకు సాగడం లేదు.

ఈ పనుల కోసం ప్రభుత్వమే ఇసుక, సిమెంట్ సరఫరా చేస్తోంది. ఇసుక ఉచితంగా అందజేయగా ఒక్కో సిమెంట్ బస్తా ధర రూ.240ల చొప్పున సరఫరా చేసింది. ఈ పనులకు సంబంధించిన సుమారు 350 బస్తాల సిమెంట్, కొంత నగదు పేమెంట్‌ను కాంట్రాక్టర్లు వేరే పనులకు వాడుకున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్లు పనులు చేయకుండానే తమ పలుకుబడితో వాడుకున్న సిమెంట్, నగదు తిరిగి చెల్లించక పోవడం లేదా దానికి సంబంధించిన పనులు పూర్తి చేయ లేదు. స్థానిక నాయకులు కావడంతో పాటు పలుకు బడి కలిగిన కాంట్రాక్టర్లు కావడంతో వారి నుంచి తిరిగి నిధులు రాబట్టే చర్యలు తీసుకోలేని స్థితిలో సంబంధిత అధికారులు ఉన్నారు. ఇప్పటికైనా అభివృద్ధి పనులను తక్షణమే ఆరంభించి భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు పాలనను అందుబాటులో ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.